

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్ స్వరూపరాణి తదితరులు

పాఠశాల భవన నిర్మాణం పూర్తికి చర్యలు

ముషీరాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పాఠశాల నిర్మాణ పనులను పూర్తిచేయాలని కోరుతూ ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్ స్వరూపరాణి ఎమ్మెల్యేను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణం పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు, రతన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రాజు ఉస్తాద్, హరికృష్ణ

ముత్తన్న ఆశయసాధనకు దళితులు కృషిచేయాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ మేకల ముత్తన్న ఆశయ సాధనకు యువత, దళితులు కృషిచేయాలని షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ఎస్. రాజు ఉస్తాద్ పిలుపునిచ్చారు. ముత్తన్న సంతాప సభను మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. అంతకుముందు లోయర్ ట్యాంక్‌బండ్‌లోగల అంబేడ్కర్ విగ్రహానికి, ముత్తన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం, పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాజు ఉస్తాద్ మాట్లాడుతూ.. మేకల ముత్తన్న జీవితాంతం దళితుల హక్కుల సాధన కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయకంటి నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు జగన్నాథం, కార్యదర్శి పచ్చ శ్రీనివాసులు, ఆలిండియా జాతీయ కార్యదర్శి మచ్చ విజయ్‌కుమార్, ఆలిండియా ఎస్సీ కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు మహేశ్వర్‌రాజ్, సెక్రటరీ జనరల్ బేర బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నోట్‌బుక్స్, ఆటవస్తువులు అందజేస్తున్న పంచముఖి, కిషోర్

దివ్యాంగులకు సహకారం అందిస్తాం

ముషీరాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ఆదుకోవాలని నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ కౌన్సిల్ మెంబర్ కిషోర్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని భవిత విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగులకు స్పార్క్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, ఆటవస్తువులను పంపిణీ చేశారు. కిషోర్ మట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు కావాల్సిన పరికరాలను అందించేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్పార్క్స్ ఫౌండేషన్ సీఈవో పంచముఖి, ప్రతినిధులు వివేక్, స్మిత, నాగేశ్వర్‌రావు, భవిత విద్యావనరుల కేంద్రం కో-ఆర్డినేటర్లు మల్లేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'అచ్చయ్యనగర్‌లో కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి'

రాంనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అచ్చయ్యనగర్‌లో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కె. రవిచారి డిమాండ్ చేశారు. లేకపోతే జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. మంగళవారం బస్తీవాసుల ఫిర్యాదు మేరకు అచ్చయ్యనగర్‌లో పర్యటించి డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యను పరిశీలించారు. సమస్యపై జలమండలి మేనేజర్ జ్యోతికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని జలమండలి చిలకలగూడ డీజీఎం మోహన్‌రావుకు ఫోన్ చేసి కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

నల్లకుంట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని ఆదిలీల ఫౌండేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ శ్రీవాణి చందల్ కోరారు. మంగళవారం హైదర్‌గూడలో శ్రీవాణి చందల్ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5న ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాలతోపాటు ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న పాశం యాదగిరి

చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావం

రాంనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి తెలంగాణ సాయుధ పోరాట పాఠాన్ని నేర్పిన వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐలమ్మ మనవడు చిట్యాల రామచంద్రం, అధ్యక్షురాలు చిట్యాల శ్వేత ఆధ్వర్యంలో ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భవించింది.

ఈ సందర్భంగా మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ఐలమ్మ చేసిన పోరాటాన్ని వివరించారు. ప్రభంజన్‌యాదవ్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, రజక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ.. ఐలమ్మ విగ్రహాన్ని, రజక కార్పొరేషన్, రజక భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టాలన్నారు. సంఘం నాయకులు పోశెట్టి ఉపేందర్, కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో వరదనీరు తొలగింపు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని ధోబీఘాట్, జవహర్‌నగర్ ప్రధాన రహదారి, అశోక్‌నగర్‌లో పలుచోట్ల నిలిచిన వరద నీటిని జీహెచ్ఎంసీ సిబ్బంది మంగళవారం తొలగించారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగం ఎస్ఎఫ్ఏ రాజ్‌కుమార్, సోమేష్, శివకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘం రాజకీయ శిక్షణా తరగతులు గత నెల 31 నుంచి ఈనెల 2 వరకు జరిగాయని, సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, తెలంగాణ రైతుసంఘం భవిష్యత్‌లో తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించామని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేశామన్నారు. ఎకరానికి రూ. 25 వేల నష్టపరిహారం చెల్లించాలని, మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షలు, గాయపడిన కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సమావేశంలో అరిబండి ప్రసాదరావు, శోభన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాగర్, ప్రసాదరావు



మాట్లాడుతున్న సాయిబాబా

వరద బాధితులకు న్యాయం చేయాలి

రాంనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం నగర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్ల నుంచి నివేదిక తెప్పించుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్.ప్రకాష్, భానుప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల దాడులకు

బీఆర్ఎస్ నాయకులు భయపడరు

ముషీరాబాద్/రాంనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుల దాడులకు బీఆర్ఎస్ నాయకులు భయపడరని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో వరద ముంపు ప్రాంత ప్రజలను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీష్‌రావుపై కాంగ్రెస్ నాయకులు దాడిచేసి కారును ధ్వంసం చేశారని, బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌రెడ్డికి తీవ్రమైన గాయాలయ్యాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు తగదన్నారు. కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఖమ్మంలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్‌రావు, నాయకులు బింగి నవీన్, రహీం తదితరులు పాల్గొన్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ప్రతిపక్ష నాయకులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని దాడిచేయడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ నాయకుడు ఎం. నాగేష్ ముదిరాజ్ ప్రశ్నించారు. దాడికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

గణేశ్ ఉత్సవాల్లో హిందువుల ఐక్యతను చాటండి

నల్లకుంట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ జి. ఆనంద్ గౌడ్ సూచించారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం రామకృష్ణనగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగింది.

ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. నవరాత్రుల పూజలు ఘనంగా నిర్వహించి హిందువుల ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి బాగ్‌అంబర్‌పేట డివిజన్ కన్వీనర్ చుక్క జగన్, అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్లు పి. గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ పాండురంగయ్య, జి. మల్లేష్, అచ్చిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు

మండపాల నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా చూడండి

రాంనగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో వినాయక చవితి ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మండప నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అంబర్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, జలమండలి మేనేజర్ మాజీద్, స్ట్రీట్‌లైట్ ఏఈ సౌమ్య పాల్గొన్నారు.

లక్ష్యం ఉంటే ఎంచుకున్న రంగంలో ఎదగవచ్చు

● జస్టిస్ రాధారాణి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అలనాటి సినిమాల్లో అక్కినేని వంటి నటులు కథానాయకులుగా ఉదాత్తపాత్రల్లో నటించి సమాజానికి మంచి సందేశం ఇచ్చేవారని, ప్రస్తుతం స్మగ్లింగ్, విలనిజం ఉన్న హీరోల సినిమాలు నడుస్తున్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. అక్కినేని నటించిన ప్రేమాభిషేకం సినిమా 550 రోజులు ఆడటానికి కారణం ఆయన పాత్రలో ఉన్న వ్యక్తిత్వం అని చెప్పారు. ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ రాగసప్తస్వరం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో డా. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు, సాంస్కృతిక సంస్థల అధిపతులు, విలేకరులు ప్రభు, సంతోషం సురేష్, అంజిబాబు, హేమలత, ఆర్‌వీ రమణ, రమేష్‌బాబు, బాలకృష్ణకు ఆత్మీయ సత్కారం జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. క్రమశిక్షణ లక్ష్యం ఉంటే ఎంచుకున్న రంగంలో ఎదగవచ్చని అక్కినేని నిరూపించారన్నారు. అధ్యక్షత వహించిన తిరుమల గ్రూప్ అధినేత నంగునూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. చెప్పింది ఆచరించడం అక్కినేని లక్షణం అన్నారు. తక్కువ లాభం ఉంటే ఎక్కువ టర్నోవర్ ఉంటుంది అన్న వ్యాపారసూత్రం ఆయన నుంచి నేర్చుకున్నానని చెప్పారు. తెలుగుదేశం నాయకురాలు నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ.. సాంఘిక సినిమాల్లో అక్కినేని, పౌరాణిక సినిమాల్లో ఎన్టీఆర్‌ను మించిన వారు లేరన్నారు. సంస్థ నిర్వాహకులు రాజ్యలక్ష్మి, వంశీ రామరాజు, శ్రీమణి, వసుంధర తదితరులు పాల్గొన్నారు. తొలుత అక్కినేని సినిమాల్లోని పాటలను ఆమని, బాలకామేశ్వరరావు, రామకృష్ణ తదితరులు గానం చేశారు.



సన్మానగ్రహీతలతో జస్టిస్ రాధారాణి, రాజకుమారి తదితరులు

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వసతి గృహాల ఏర్పాటు

● అడ్మిషన్లకు 8న ఇంటర్వ్యూ

నల్లకుంట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్య అభ్యసించే విద్యార్థుల కోసం ఉచిత వసతి గృహాలను ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్ట్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం నల్లకుంటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని పేద విద్యార్థుల కోసం ఉచిత వసతి గృహం, భోజనం, ప్రతి హాస్టల్‌లో రెండు ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్, బస్‌పాస్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రొఫెషనల్, గ్రాడ్యుయేషన్ కోర్సులు అభ్యసిస్తున్న వారికి ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు లేని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. అమీన్‌పూర్ (లింగంపల్లి), సన్‌సిటీ (లంగర్‌హౌస్), సుచిత్ర నేరేడ్‌మెట్, నారపల్లి తదితర ప్రాంతాలలో వసతి గృహాలు ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు వసతి గృహాల్లో ఉచిత అడ్మిషన్ల కోసం ఈ నెల 8వ తేదీ ఉదయం 10 నుంచి నల్లకుంట, శంకరమఠం మార్కెట్ సమీపంలోని ఎస్ఎల్ డయాగ్నస్టిక్ సెంటర్ ఆవరణలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9550472190 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

సమావేశంలో ట్రస్ట్ సభ్యులు పోలాప్రగడ శ్రీనివాస్, ప్రసాద్, చిరంజీవిరావు, పీవీకే ప్రసాద్, అరుణ్‌కుమార్‌సింగ్, మేనేజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

అదనపు నైపుణ్యాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు

● సింప్లీలెర్న్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో అదనపు నైపుణ్యాలను పొందడం ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమని నేటి తరం భావిస్తుందని సింప్లీలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. 18-27 సంవత్సరాల వయస్సు గల జెన్ జెడ్ తరాన్ని సింప్లీలెర్న్ సంస్థ అధ్యయనం చేసింది. ఈ వివరాలను సింప్లీలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. దేశంలో యువతకు నైపుణ్యం మెరుగుపరచడం ద్వారా దాదాపు 10 కోట్ల మందిని వర్క్‌ఫోర్స్‌లోకి తీసుకురావచ్చన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇది దోహదపడుతుందని, 2030 నాటికి అంతర్జాతీయంగా వర్క్‌ఫోర్స్‌లో 30% జెన్ జెడ్ ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిశ్రమలో మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి జెన్ జెడ్ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటుందని వివరించారు.

అదనపు నైపుణ్యాలను కోరుకుంటున్న వారిలో 66% బ్యాచిలర్ డిగ్రీలను కలిగి ఉన్నారని తెలిపారు. దాదాపు 60% మంది అభ్యాసకులు ప్రస్తుతం ఐటీ రంగంలో ఉపాధి పొందుతుంటే, 40% మంది ఐటీయేతర రంగాలలో ఉపాధి పొందుతున్నారని, 83% మంది జెన్ జెడ్ ఉద్యోగులు మెరుగైన ఉద్యోగావకాశాలు పొందడానికి అదనపు నైపుణ్యాలను పొందాలని గట్టిగా కోరుకుంటున్నారని వెల్లడించారు. ఇలా కోరుకునే వారిలో బిజినెస్ ఎనలిటిక్స్‌ను 35.3% కోరుకుంటుంటే, ఏఐ, మెషీన్ లెర్నింగ్ టూల్స్ అభ్యసించాలని 33.9%, సైబర్ సెక్యూరిటీని 20.2% కోరుకుంటున్నారని ఆయన వివరించారు.

నైతికత, స్వేచ్ఛపై నెలరోజులు అవగాహన

పంజాగుట్ట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు సమాజంలో నైతిక విలువలు లోపించడమే కారణమని జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆందోళన వ్యక్తం చేసింది. నైతిక విలువలను పెంపొందించేందుకు నెల రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు క్యాంపెయిన్ కన్వీనర్ డాక్టర్ అస్రా ముహ్సినా తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రచారానికి సంబంధించిన పోస్టర్‌ను మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖతీజా మెహ్వీన్, ప్రతినిధులు సాజిదాబేగం, ఇష్రత్ బానుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, జన సమూహాలు అధికంగా ఉండే ప్రదేశాల్లో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అనే అంశంపై నెల రోజులపాటు అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ప్రతినిధులు



సదస్సులో ప్రొఫెసర్ మాథ్యూ జార్జ్, ప్రొఫెసర్ గణేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా జోసెఫ్ తదితరులు

వలసవాద దోపిడీ నుంచి అభివృద్ధి వైపు..

బేగంపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047ను సాధించడంలో ఉన్నత విద్యా సంస్థల పాత్ర అనే అంశంపై ఐసీఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో రెండు రోజుల సెమినార్‌ను బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జె.మాథ్యూ జార్జ్, ముఖ్యవక్తగా ప్రొఫెసర్ సి.గణేష్ పాల్గొన్నారు. భారతదేశంలో విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి అవసరమైన సేవల స్థోమత, లభ్యత తదితర విషయాలపై ప్రొఫెసర్ జె.మాథ్యూ జార్జ్ మాట్లాడారు. ఆర్థికాభివృద్ధితోపాటు సామాజిక, సాంస్కృతిక ప్రగతిని కలుపుకొని సమగ్రాభివృద్ధికి కృషిచేయాలని డాక్టర్ సి.గణేష్ సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా జోసెఫ్ మాట్లాడుతూ.. వలసవాద దోపిడీ నుంచి అభివృద్ధి చెందుతున్న దేశంగా సాధించిన విజయాల వైపు భారతదేశం ప్రయాణాన్ని నొక్కి చెప్పారు. నగరానికి చెందిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పరిశోధకులు, విద్యావేత్తలు సదస్సులో ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బస్తీ దవాఖానాలో అందుబాటులో అన్ని మందులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ మౌలానా ఆజాద్‌నగర్‌లోగల బస్తీ దవాఖానాలో అన్ని మందులు అందుబాటులో ఉంచామని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం దవాఖానాను ఆమె సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు మల్లికార్జున్, ఆర్. సంతోష్, ఓంప్రకాష్, వాసు, డాక్టర్ కౌశిక్, కీర్తి, సురేష్, రామకృష్ణ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డుల ఎంపికలో

ఫిజికల్ డైరెక్టర్లను విస్మరించిన ప్రభుత్వం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బెస్ట్ టీచర్ అవార్డులకు ఎంపిక చేయడంలో ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లను ప్రభుత్వం విస్మరించిందని రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం. పర్వతాలు గౌడ్ ఆరోపించారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాల ఉన్నత విద్యాశాఖలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్‌లకు బెస్ట్ టీచర్ అవార్డుల జాబితాలో అవకాశం కల్పించారని, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న వారికి అన్యాయం చేయడం తగదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లను బెస్ట్ టీచర్ అవార్డుల జాబితాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు పక్కనే చెత్తాచెదారం

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పారిశుధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వహిస్తోంది. కాచిగూడ రోడ్డులో చెత్త పేరుకుపోయినా సిబ్బంది తొలగించ లేదు.





జూపాక సుభద్రను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

జూపాక సుభద్రకు శ్రీకళానికేతన్ పురస్కారం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కవయిత్రిగా, రచయిత్రిగా సమాజాన్ని ప్రభావితం చేసిన జూపాక సుభద్ర అభినందనీయురాలని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీకళానికేతన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 60 వసంతాల వజ్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త, కాలమిస్టు, సంఘసేవకురాలు జూపాక సుభద్రకు కొసనం సుధాకర్ శ్రీకళానికేతన్ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. రమణాచారి మాట్లాడుతూ.. సుభద్రను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆమె రచనలతోనే కాకుండా వృత్తిపరంగా మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. శ్రీకళానికేతన్ ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్. అనంత పద్మనాభరావు, డా. శ్రీనివాస్‌రెడ్డి, కోయి కోటేశ్వరరావు, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రదర్శించిన మూల్యం నాటిక ప్రేక్షకులను రంజింపజేసింది.

ఆభరణాలు తీసుకుని డబ్బు ఎగవేత

బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల విలువ చేసే ఆభరణాలు తీసుకొని డబ్బు ఎగ్గొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్2లో తిబారుమల్ జువెల్స్ ప్రతినిధి సందీప్ అగర్వాల్‌కు కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేసి దుకాణానికి వచ్చే వినియోగదారుల పేర్లు చెప్పాడు. తనకు నగలు కావాలని, డిజైన్‌లను వాట్సాప్‌లో పంపించాలని కోరాడు. సందీప్ కొన్ని ఫొటోలు పంపాడు. వాటిలో గోల్డ్ కాయిన్ హారం, లక్ష్మీపికాక్ రూబీ హారం, నక్షీ నెక్లెస్‌ను ఎంపిక చేసుకున్నాడు. వీటి విలువ రూ. 29.35 లక్షలు. తాను ఉంటున్న నార్సింగ్‌లోని రాజ్ పుష్పా ఎటెర్నియా విల్లాకు పంపిస్తే చెక్కు ఇస్తానని చెప్పాడు. ఈ మేరకు సందీప్ నగలు పంపించగా అతడు రెండు చెక్కులు ఇచ్చాడు. మరుసటి రోజు సదరు వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్‌లో బ్యాలెన్స్ లేదు.. రెండు రోజులు తర్వాత జమ చేయాలని చెప్పాడు. ఇలా వాయిదా వేస్తూ వస్తున్నాడు.

సందీప్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి రాజ్ పుష్పా ఎటెర్నియాకు వెళ్లి వాకబు చేయగా.. విల్లాను ఖాళీ చేసినట్టు తెలిసింది. మోసపోయినట్టు గ్రహించిన సందీప్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లొచ్చే సరికి రూ. 14 లక్షలు చోరీ

జీడిమెట్ల, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లివచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 14 లక్షల చోరీ చేశారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన హనుమాన్‌రామ్ కుత్బుల్లాపూర్ గ్రామంలో స్టీల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం పై అంతస్థులో నివసిస్తున్నాడు. గత శనివారం బెంగళూరులో ఉంటున్న సోదరి ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. మంగళవారం ఇంటికి తిరిగి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన రూ. 14 లక్షలు కనిపించలేదు. చోరీ అయ్యాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.